క్లుప్తంగా

ముగిసిన పోలమ్మ పండగ

బాడంగి: మండల కేంద్రంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న పోలమ్మ పండగ బుధవారంతో ముగిసింది. మంగళవారం రాత్రి తిరువీధి అనంతరం చావిడిలో దించిన అమ్మవారి ఘటాలను పూజారులు, జన్ని ముత్యాలు తలపై పెట్టుకుని గ్రామ శివారులోని అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. అక్కడికి చేరుకున్న భక్తులంతా అమ్మవారికి చీరలు, పసుపు, కుంకుమ సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు.

ఎమ్మెల్యే పరామర్శ



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

తెర్లాం: మండలంలోని సుందరాడ గ్రామసచివాలయం డిజిటల్ అసిస్టెంట్ ఉప్పాడ శ్రీకాంత్ గుండెపోటుతో మంగళవారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు మృతుడి గ్రామమైన ఉద్దవోలుకు బుధవారం వెళ్లి, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. చిన్న వయసులో శ్రీకాంత్ మృతి చెందడం చాలా బాధాకరమని, ఆయన లేని లోటు ఆ కుటుంబానికి ఎవరూ తీర్చలేరన్నారు. ఆయన వెంట మాజీ జెడ్పీటీసీ, డీసీసీబీ డైరెక్టర్ బోను అప్పలనాయుడు, ఉద్దవోలు సర్పంచ్ ప్రతినిధి విజయప్రసాద్ తదితరులు ఉన్నారు.

రూ.9 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం



తిరుమలనగర్‌లో కొత్తగా నిర్మించిన సీసీ రోడ్డు

రాజాం: మున్సిపాలిటీ పరిధిలోని తిరుమల నగర్‌లో రూ.9 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఎన్నో ఏళ్లుగా సరైన రోడ్డు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడిన పట్టణ వాసులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పక్కా రోడ్డు సదుపాయం కల్పించింది. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా నిధులు మంజూరు చేసి, రోడ్డు నిర్మించింది. గ్రామీణులకు మౌలిక సదుపాయాల కల్పనలో జగనన్న సర్కారు పనితీరుకు గ్రామస్తులు వందకు వంద మార్కులు వేస్తుండడం విశేషం.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బాడంగి: మండలంలోని పినపెంకి, రేజేరు, ఆనవరం, వాడాడ, పాల్తేరు, బొత్సవానివలస, అల్లుపాల్తేరు, గూడెపువలస, ఆకులకట్ట తదితర గ్రామాలకు గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాసరావు ఓ ప్రకటనలో బుధవారం వెల్లడించారు. పినపెంకి దగ్గరున్న విద్యుత్ సబ్‌స్టేషన్‌లో కొత్తగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ అసౌకర్యం కలగనుందని, వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

100 మద్యంసీసాలు స్వాధీనం

వంగర: మండల పరిధిలోని వి.వి.ఆర్.పేట గ్రామం దగ్గరలో అక్రమంగా తరలిస్తున్న 100 మద్యంసీసాలను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఈబీ సీఐ బి.శ్రీధర్ బుధవారం తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, ఓ వ్యక్తిని అరెస్ట్ చేశామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విత్తనాల పంపిణీ



రైతులకు విత్తనాలు అందిస్తున్న దృశ్యం

రేగిడి: మండలంలోని చిన్నశిర్లాం గ్రామంలో రైతులకు మినుము, నువ్వుల విత్తనాలను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రెడ్డీస్ ఫౌండేషన్ మేనేజర్ హరిబాబు మాట్లాడుతూ వేసవి పంటల సాగుకు రైతులు ముందుకు రావాలని, వేసవి పంటల సాగు ద్వారా భూగర్భ జలాలు కాపాడుకోవడంతో పాటు నేల సారవంతంగా ఉంచుకోవచ్చన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు, సర్పంచ్ టంకాల ఉమాపాపినాయుడు, ఏరియా మేనేజర్ దేవుడుబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కార్పెంటర్స్‌డే

గజపతినగరం: మండల కేంద్రంలో కార్పెంటర్స్‌డేను ఏపీ కార్పెంటర్స్, వడ్రంగి అసోసియేషన్, వీరబ్రహ్మేంద్రస్వామి యూనియన్ జిల్లా కన్వీనర్ అండ్లూరి గణేష్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. పురిటిపెంట సచివాలయంలో ఉచితంగా రిపేర్లు చేశారు. ఏపీ కార్పెంటర్స్ మండల అధ్యక్షుడు కె.అప్పలాచారి,ఉపాధ్యక్షుడు అరికతోట జగదీష్, నాయకులు సింహాద్రి సన్యాసిరావు, పారాది శ్రీను, సూరిబాబు,వేమలి సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీదే మళ్లీ అధికారం

- ఎన్నికల ప్రచారంలో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడుకు స్వాగతం పలుకుతున్న మహిళ

తెర్లాం: తాము చేపడుతున్న ఎన్నికల ప్రచారంలో ప్రజల నుంచి వస్తున్న స్పందన చూస్తుంటే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలో మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే అధికారంలోకి రావడం ఖాయమని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. మండలంలోని పెరుమాళి గ్రామంలో ఎన్నికల ప్రచారాన్ని బుధవారం సాయంత్రం నిర్వహించారు. గ్రామంలోని ప్రతీ ఇంటికి వారు వెళ్లి, ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమం వివరించారు. మే 13వ తేదీన జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులకు ఇచ్చే రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి, బొబ్బిలి ఎమ్మెల్యేగా శంబంగి వెంకట చినఅప్పలనాయుడును, విజయనగరం ఎంపీగా బెల్లాన చంద్రశేఖర్‌ను మరోసారి గెలిపించాలని కోరారు. అనంతరం నిర్వహించిన సభలో ఎంపీ బెల్లాన మాట్లాడుతూ సీఎం జగనన్న అమలు చేసిన నవరత్నాల పథకాలు ప్రతీ కుటుంబానికి వర్తించాయని, ఆ పథకాలే మళ్లీ వైఎస్సార్‌సీపీని గెలిపిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రతీ వైఎస్సార్‌సీపీ కార్యకర్త, నాయకుడు ఎన్నికలు జరిగేంతవరకు సైనికుల్లా పనిచేసి, పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలన్నారు. ఎమ్మెల్యే శంబంగి మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా సీఎం జగన్ సంక్షేమ పథకాలను అమలు చేసి, గొప్ప ముఖ్యమంత్రిగా పేరు తెచ్చుకున్నారన్నారు. ఆయన చేసిన అభివృద్ధి పనులు, అమలు చేసిన సంక్షేమ పథకాలే తనను మళ్లీ ఎమ్మెల్యేగా గెలిపిస్తాయన్నారు. గతంలో బొబ్బిలి నియోజకవర్గంలో ఎన్నికైన ఎమ్మెల్యే గ్రామాల్లో పర్యటించిన దాఖలాలు లేవని, తాను ఐదేళ్లలో ఒక్కో గ్రామాన్ని అనేక సందర్భాల్లో సందర్శించి ప్రజల కష్ట,సుఖాలను తెలుసుకున్నానన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా బెల్లాన చంద్రశేఖర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అంతకుముందు గ్రామంలో ఎమ్మెల్యే, ఎంపీలకు ప్రజలు ఘనస్వాగతం పలికారు. మహిళలు వారి నుదుటన బొట్టు పెట్టి, హారతులు ఇచ్చి సాదర స్వాగతం పలికారు. ఎన్నికలప్రచారం ఆద్యంతం జై జగన్.. జై వైఎస్సార్‌సీపీ నినాదాలతో గ్రామం మార్మోగింది. కార్యక్రమంలో ఎంపీపీ ప్రతినిధి బాబ్జీరావు, జెడ్పీటీసీ ప్రతినిధి రామారావు, బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ బి.శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ సత్యనారాయణ, అప్పలరాజు రమాదేవి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు టి.సత్యంనాయుడు పాల్గొన్నారు.

ముగిసిన ‘పది’ పరీక్షలు



రామభద్రపురం జెడ్పీ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రం నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు

రామభద్రపురం: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ముగిశాయి. మార్చి18వ తేదీ నుంచి ప్రారంభమైన ఈ పరీక్షలు సజావుగా జరిగాయి. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రంలో 286 మంది, గ్లోబల్ వ్యూ స్కూల్ పరీక్షా కేంద్రంలో 250 మంది విద్యార్థులు పరీక్షలు రాసినట్లు ఎంఈవో–2 పెంటయ్య తెలిపారు.

రాజాం: మండలంలోని 8 కేంద్రాల్లో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. బుధవారం జరిగిన ఆఖరి పరీక్ష సోషల్ స్టడీస్ పరీక్షకు మొత్తం 1683 మంది విద్యార్థులకు గాను 1633 మంది విద్యార్థులు హాజరైనట్లు ఎంఈవో బి.ప్రవీణ్ కుమార్ తెలిపారు.

సంతకవిటి: మండల కేంద్రంతో పాటు గుళ్లసీతారాంపురం, మండాకురిటి, మందరాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో కొన్నిరోజులుగా జరుగుతున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలు బుధవారంతో ముగిశాయి.

ఆధ్యాత్మిక భావాలు పెంపొందించుకోవాలి



భక్తులనుద్దేశించి, మాట్లాడుతున్న రుద్రకోటేశ్వర శర్మ

రేగిడి: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత అని, ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక భావాలు పెంపొందించుకోవాలని వేదపండితులు, యజ్ఞకర్త అంపోలు రుద్రకోటేశ్వరశర్మ అన్నారు. మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో విజయదుర్గ, లక్ష్మీగణపతి, సుబ్రహ్మణ్యస్వామి ఆలయాల ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాల్లో భాగంగా ప్రాతఃకాల అర్చనలు, క్షీరాధివాసం, సూర్య నమస్కారాలు తదితర పూజలు బుధవారం చేశారు. అనంతరం ఆయన భక్తులను ఉద్దేశించి, ప్రవచనాలు చెప్పారు. భగవంతుడు ఎక్కడో లేరని, మన హృదయాల్లోనే ఉన్నారని, నిర్మలమైన మనసుతో భగవంతుడిని ధ్యానం చేస్తే ఆయన తప్పక దర్శనమిస్తారన్నారు. ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో ఆధ్యాత్మికతతో మెలగాలని, మంచి చేయాలనే సంకల్పంతో ముందుకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో అంపోలు రాంప్రసాద్‌శర్మ, వేమకోటి హరీష్‌శర్మ, ఆరవెల్లి ప్రసాద్ శాస్త్రి, రవి శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

మరింత మెరుగైన పాలనే సీఎం జగన్ లక్ష్యం

- ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి



మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మణరావు, జెడ్పీటీసీ సరస్వతి

రామభద్రపురం: మరింత మెరుగైన పాలనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, జెడ్పీటీసీ సభ్యురాలు అప్పికొండ సరస్వతి అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం వారు మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వం తన పనితీరును మరింత మెరుగుపరుచుకునేందుకు ప్రజల నుంచి సలహాలు, సూచనల స్వీకరణ కోసం మేమంతా సిద్ధం పేరుతో సీఎం జగనన్న బస్సుయాత్రకు శ్రీకారం చుట్టారని తెలిపారు. బస్సుయాత్రకు సంఘీభావంగా మనమంతా సిద్ధమై ప్రభుత్వం చేసిన మంచిని ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. ఇంటింటికీ వెళ్లి, సీఎం జగన్ చేసిన మేలును తెలియజేయాలన్నారు. ప్రభుత్వ పథకాలు పొందిన ప్రతిఒక్కరూ వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించి, మరోసారి అధికారంలోకి తీసుకురావాలన్నారు. అమ్మఒడి, విద్యాకానుక, విద్యాదీవెన, ఇళ్లస్థలాలు, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, రైతు భరోసా తదితర సంక్షేమ పథకాలు అమలు చేయగా, వీటిలో ప్రతీ కుటుంబానికి ఏదో ఒక పథకం ద్వారా లబ్ధి జరిగిందన్నారు. పైసా అవినీతికి తావులేకుండా నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు నగదు జమ చేసిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదేనన్నారు. అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమం కోరుకునే మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లోనూ మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవాలని, అలాగే ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడును కూడా మళ్లీ ఎమ్మెల్యేగా గెలిపించుకునేందుకు ప్రతిఒక్కరూ కష్టపడాలన్నారు. కార్యక్రమంలో బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ డబ్ల్యుఎన్ రాయులు, మండల యూత్ అధ్యక్షుడు పత్తిగుళ్ల ఏక్‌నాథ్, సీనియర్ నాయకులు కనిమెరక అప్పారావు, పువ్వల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలి

- ఎన్నికల ప్రచారంలో రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి తలే రాజేష్



కొట్టిశలో ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే అభ్యర్థి తలే రాజేష్‌కు ఘనస్వాగతం పలుకుతున్న మహిళ

వంగర: రానున్న సార్వత్రిక ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీని ఆశీర్వదించి, సీఎం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్ కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని గీతనాపల్లి, కొట్టిశ, లక్ష్మీపేట గ్రామాల్లో బుధవారం పర్యటించిన ఆయనకు ఆయా గ్రామాల ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన ఐదేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ద్వారా ప్రజలకు జరిగిన మేలును వివరించారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజాసంక్షేమానికి పాటుపడుతున్న జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రి అయితే మరింత అభివృద్ధి, సంక్షేమం చూడొచ్చన్నారు. ఎన్నికల వేళ టీడీపీ నేతలు చెప్పే మాయమాటలు నమ్మి, మోసపోవద్దన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి, వైఎస్సార్ సీపీని మరోసారి అధికారంలోకి తీసుకురావాలని, తనను కూడా ఎమ్మెల్యేగా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు నెయ్యిగాపుల శివరామకృష్ణ, ఉత్తరావెల్లి లక్ష్మి, ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, పార్టీ మండల కన్వీనర్ కరణం సుదర్శనరావు, జేసీఎస్ మండల కన్వీనర్ కిమిడి ఉమామహేశ్వరరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు బొంతు వెంకటరావు, వేమిరెడ్డి సూర్యనారాయణ, యలకల అన్నంనాయుడు, ఉత్తరావెల్లి గణేష్‌బెనర్జీ, తెంతు జోగినాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక



పార్టీలో చేరిన వారిని సాదరంగా ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

తెర్లాం: మండలంలోని పెరుమాళి గ్రామానికి చెందిన పలు కుటుంబాల వారు టీడీపీని వీడి, వైఎస్సార్ సీపీలో బుధవారం రాత్రి చేరారు. వీరందరికీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు పార్టీ కండువాలు వేసి, సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో పెరుమాళి మాజీ సర్పంచ్ వెలగాడ కృష్ణ, కుప్ప శ్రీనివాసరావు, ముదునూరు సత్యనారాయణరాజు, కొన్నా కృష్ణ, బాణాల రాంబాబు, రేగాన శంకరరావు, కంచు సూర్యనారాయణ, జరజాన రమణ, వెలగాడ శివ, బాణాల గణేష్, మైలపల్లి శంకరరావు, వినోద్‌కుమార్, కిశోర్, దేవరపు కనకయ్యతో పాటు మరికొన్ని కుటుంబాల వారు ఉన్నారు. వీరంతా మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై తామంతా పార్టీలో చేరామని తెలిపారు. ఎమ్మెల్యే శంబంగి మాట్లాడుతూ త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని మళ్లీ అధికారంలోకి తీసుకురావడంతో పాటు బొబ్బిలి నియోజకవర్గం ఎమ్మెల్యేగా తనను మరోసారి అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పెరుమాళి మాజీ సర్పంచ్ కొరగంజి వెంకట అప్పారావు, మాజీ ఎంపీటీసీ శివాజీ, వైస్ ఎంపీపీ ప్రతినిధి అప్పలరాజు, పార్టీ మండల అధ్యక్షులు తెంటు సత్యంనాయుడు, బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసరావు, జెడ్పీటీసీ ప్రతినిధి రామారావు, ఎంపీపీ ప్రతినిధి బాబ్జీరావు, డీసీసీబీ డైరెక్టర్ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం

బొబ్బిలి: పట్టణంలోని విజేత హైస్కూల్‌లో సినీ హీరో రామ్‌చరణ్ పుట్టినరోజు సందర్భంగా ఆయన అభిమానులు బుధవారం రక్తదానం చేశారు. అవేర్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో చేపట్టిన ఈ కార్యక్రమంలో యువతీ, యువకులు పాల్గొని, రక్తం దానం చేశారు. మొత్తం 72 యూనిట్ల రక్తం సేకరించినట్లు అవేర్ సంస్థ అధ్యక్షుడు పెద్దింటి మనోజ్ తెలిపారు.

వంద రోజుల పనిదినాలు పూర్తి చేయాలి

రాజాం సిటీ: గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న వంద రోజుల పనిదినాలను సిబ్బంది ప్రణాళిక ప్రకారం పూర్తిచేయాలని కెపాసిటీ బిల్డింగ్ ఏపీడీ చిన్నంనాయుడు అన్నారు. స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో సిబ్బందితో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంద రోజుల పనిదినాలతో పాటు 90 రోజుల హౌసింగ్ వర్క్స్, మొక్కల పెంపకం తదితర అంశాలపై గ్రామాల వారీగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీవో సాయిరాం పాల్గొన్నారు.

31న భద్రకాళి, మజ్జిగౌరి జాతర

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం సంతలో ఉన్న భద్రకాళి,మజ్జిగౌరి అమ్మవార్ల గుడి వద్ద ఈనెల 31న జాతర నిర్వహించనున్నట్లు జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి, ఆలయ ధర్మకర్త జగదీష్ నాయుడు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేయనున్నామని, ఆరోజు రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

రేవళ్లపాలెంలో అగ్ని ప్రమాదం

శృంగవరపుకోట : మండలంలోని రేవళ్లపాలెంలో బుధవారం ఉదయం జరిగిన అగ్ని ప్రమాదంలో గ్రామానికి చెందిన చిటికిరెడ్డి అర్జున పూరిల్లు కాలిపోయింది. ఈ ప్రమాదంలో నిత్యావసర సామగ్రి, దుస్తులు, ధాన్యం కాలి బూడిదయ్యాయి. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు.

బాధ్యతల అప్పగింత



ఎన్నికల విధులకు సంబంధించి పోలింగ్ కేంద్రాల పీవోలకు సూచనలిస్తున్న ఎంఈవో ప్రవీణ్‌కుమార్

రాజాం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల పీవో(ప్రొసీడింగ్ ఆఫీసర్)లకు బాధ్యతలు అప్పగిస్తున్నారు. స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయం వద్ద ఎంఈవో ప్రవీణ్‌కుమార్ చేతులమీదుగా పలువురు పీవోలకు ఆర్డర్ కాపీలు బుధవారం అందజేశారు. ఈ నెల 28వ తేదీన రాజాం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి, పీవోలకు ఒక్కరోజు శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంఈవో తెలిపారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఈ శిక్షణ కార్యక్రమానికి ఎన్నికల ఆర్‌వోతో పాటు ఉన్నతాధికారులు కూడా హాజరవుతారని, పీవోలంతా తప్పనిసరిగా రావాలన్నారు.

మేం సిద్ధం.. మా బూత్ సిద్ధం కరపత్రాల పంపిణీ



ఇంటింటికీ వెళ్లి, కరపత్రాలు అందిస్తున్న దృశ్యం

రాజాం: మండలంలోని గార్రాజుచీపురుపల్లి గ్రామంలో మేం సిద్ధం.. మా బూత్ సిద్ధం కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను బుధవారం పంపిణీ చేశారు. ఎంపీటీసీ సభ్యులు ధర్మాన పద్మావతి, సచివాలయ కన్వీనర్ పొన్నాడ సన్యాసినాయుడు, పొన్నాడ తవిటినాయుడు, గృహసారథులు కలిసి, పార్టీ కార్యకర్తల ఇంటింటికీ వెళ్లి, వీటిని అందజేశారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కోరారు.

శతశాతం ఓటింగ్ జరగాలి



ఓటు వినియోగంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

బాడంగి: రానున్న ఎన్నికల్లో శతశాతం ఓటింగ్ నమోదు కావాలని, ప్రతీ ఓటరు తమ ఓటుహక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని సహాయ ఎన్నికల అధికారి ఎస్.రాజారావు అన్నారు. మండలంలోని వాడాడ, పాల్తేరు గ్రామాల్లో స్వీప్(సిస్టమేటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్) కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు వజ్రాయుధమని, మనకున్న శక్తివంతమైన ఈ ఆయుధంతో మన భవిష్యత్ మార్చుకోవచ్చన్నారు. రానున్న ఎన్నికల్లో నిర్భయంగా, స్వేచ్ఛగా ఓటు వేసి, నచ్చిన నాయకుడిని ఎన్నుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంసీసీ అధికారి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రం వద్ద సిబ్బందికి సూచనలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి

బొబ్బిలి: పట్టణంలోని పోలింగ్ కేంద్రాలను మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి బుధవారం పరిశీలించారు. విద్యుత్, తాగునీరు, ఫర్నిచర్, ర్యాంప్ వంటి సదుపాయాలు ఉన్నవీ లేనివీ చూసి, ప్రతీ పోలింగ్ కేంద్రంలో మౌలిక వసతులు తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూడాలని, నిర్భయంగా, స్వేచ్ఛగా ఓటర్లు తమ ఓటు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగాలి



బాడంగి: కోటిపల్లి గ్రామ ప్రజలకు ఎన్నికల నిబంధనలు తెలియజేస్తున్న బొబ్బిలి డీఎస్పీ శ్రీనివాసరావు



రేగిడి: గ్రామస్తులకు సూచనలిస్తున్న ఎస్ఐ శ్రీనివాసరావు

బాడంగి: రానున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరగాలని, ఆ దిశగా అధికారులు కృషి చేయాలని, గ్రామస్తులు కూడా సహకరించాలని బొబ్బిలి డీఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన కోటిపల్లి, వాడాడలో బుధవారం పర్యటించిన ఆయన ఎన్నికల నిబంధనలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఎన్నికల నేపథ్యంలో ఎవరూ తగాదాలకు పాల్పడవద్దని, ఎన్నికల కమిషన్ జారీ చేసిన ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తూ.చ. తప్పకుండా పాటించాలన్నారు. కార్యక్రమంలో రూరల్ సీఐ తిరుమలరావు, ఎస్ఐ ఆర్.జయంతి తదితరులు పాల్గొన్నారు.

రేగిడి: ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో వివాదాలు జరగకుండా చూసుకోవాలని ఎస్ఐ శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని అంబాడ గ్రామంలో బుధవారం పర్యటించిన ఆయన అక్కడి ప్రజలకు ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుపై అవగాహన కల్పించారు. డబ్బు, మద్యం రవాణా జరగకుండా చర్యలు చేపడుతున్నామని, ఎవరైనా అవాంఛనీయ ఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

సంతకవిటి: ఎన్నికల వేళ ఎవరూ అనవసరమైన గొడవలకు పాల్పడవద్దని ఎస్ఐ షేక్ శంకర్ సూచించారు. మండలంలోని ఎం.ఆర్.అగ్రహారం, గోళ్లవలస గ్రామాలకు బుధవారం వెళ్లిన ఆయన అక్కడి ప్రజలకు ఎన్నికల నిబంధనలపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రజలంతా ఎన్నికల నిబంధనలకు లోబడి ఉండాలని, ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సహకరించాలని కోరారు.

సక్రమంగా అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీవో కనకదుర్గ

రేగిడి: అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ సక్రమంగా ఉండాలని రాజాం ఐసీడీఎస్ పీవో డాక్టర్ కనకదుర్గ సూచించారు. మండల కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్తలతో బుధవారం సమావేశమైన ఆమె కేంద్రాల నిర్వహణపై అవగాహన కల్పించారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సరఫరా చేస్తున్న పౌష్టికాహారం తప్పనిసరిగా వారికి అందివ్వాలన్నారు. ప్రతిఒక్కరూ ప్రతిరోజూ పౌష్టికాహారం తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శశికళ తదితరులు పాల్గొన్నారు.